సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ప్రత్యేక శిక్షణ తరగతుల పరిశీలన



కృష్ణా కళాశాలలో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న డీవీఈవో సత్యనారాయణ

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులు బాగున్నాయని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఆర్.సత్యనారాయణ తెలిపారు. కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణ తరగతుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. వాటిని సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి



జూలో పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, సందర్శకులు

ఆరిలోవ: పర్యావరణంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ప్రారంభించిన ×వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణం సుస్థిరత×కార్యక్రమంలో భాగంగా గురువారం జూలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జూ ఎడ్యుకేషన్ బృందం ఆధ్వర్యంలో సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తదితర వాటిపై సందర్శకులకు అవగాన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన క్యూరేటర్ మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సందర్శకులు, జూ సిబ్బంది పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంకు పోటీల విజేత భావజ్ఞ



విజేతలతో అనూప్ మనోహర్

బీచ్ రోడ్డు: యాక్సిస్ బ్యాంక్ నిర్వహించిన స్ప్లాష్ 2022–23 పోటీల్లో విజేతగా నగరానికి చెందిన భావజ్ఞ చలపరెడ్డి నిలిచారు. దేశ వ్యాప్తంగా ఆర్ట్, క్రాఫ్ట్, లిటరేచర్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా.. ఆర్ట్ విభాగంలో భావజ్ఞ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు భావజ్ఞకు యాక్సిస్ బ్యాంక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనూప్ మనోహర్ బహుమతి అందజేశారు. మొదటి బహుమతి రూ.లక్ష ఇవ్వగా.. ఆరుగురికి రన్నరప్‌గా రూ.50వేలు చొప్పున అందజేశారు.

సంస్కృతం, హిందీ భాషలపై పట్టు సాధించాలి

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు అధ్యాపకులు బి.సంతోష్, సీహెచ్.సురేష్‌లు సంస్కృతం, హిందీ, జనరల్ స్టడీపై అవగాహన కల్పించారు. సంస్కృతం, హిందీ భాషాలపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా భవిష్యత్‌లో అవకాశాలు పెరుగుతాయన్నారు. ఆయా భాషలు నేర్చుకోవడంలో మెలకువలు వెల్లడించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ జనరల్ స్టడీ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. పోటీ పరీక్షల్లో జనరల్ స్టడీస్ పాత్ర, ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ శునకాలు

- ఏయూలో గుంపులుగా సంచారం
- భయాందోళనలో విద్యార్థులు, ఆచార్యులు



మెట్లపై నిద్రిస్తున్న శునకం



విభాగాల బయట సంచరిస్తున్న శునకాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శునకాలు గుంపులుగా తిరుగుతూ భయపెడుతున్నాయి. వాహనాలపై వెళ్లేవారిని వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. హాస్టల్స్ వద్ద పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తూ విద్యార్థులు, ఆచార్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తమపై ఎక్కడి దాడి చేస్తాయనే భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రాత్రి వేళల్లో వర్సిటీలో భయటకు రావాంటే విద్యార్థులు వణికిపోతున్నారు.

విభాగాల వద్ద తిష్ట

వర్సిటీలో పలు విభాగాల వద్ద శునకాలు తిష్ట వేస్తున్నాయి. హాస్టళ్లకు సమీపంలో ఉండే విభాగాల వద్ద ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. వసతి గృహాల్లో మిగిలిన ఆహార పదార్థాల కోసం ఇవి వర్సిటీని వదిలి వెళ్లడం లేదు. రాత్రి వేళల్లో లైబ్రరీ నుంచి హాస్టల్‌కు వెళ్లే సమయంలో, వాహనాలపై విద్యార్థులు వెళ్లే సమయంలో కుక్కలు వెంటపడి తరుముతున్నాయి. దీంతో అదుపు తప్పి పడిపోయి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల క్యాంపస్‌లో విద్యార్థినులకు ప్రత్యేకంగా రెండు హాస్టళ్లను ఏర్పాటు చేశారు. దీంతో సాయంత్రం వేళలలో విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

తరచూ కుక్కల మృత్యువాత

కొంత మంది అపరిచిత వ్యక్తులు రాత్రి వేళల్లో మాంసం దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థ మాంసం ముక్కలను తీసుకువచ్చి వర్సిటీలో సంచరించే శునకాలకు వేస్తున్నారు. వీటిని తిని కుక్కలు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి.

కానరాని నియంత్రణ

వర్సిటీలో పరిపాలన భవనం నుంచి విభాగాల వరకు శునకాలకు లెక్కేలేదు. వీటి నియంత్రణ సైతం గాలికొదిలేశారు. దీంతో పదుల సంఖ్యలో కుక్కలు హాస్టళ్ల భవనాలు, విభాగాల వద్ద నిత్యం సంచరిస్తున్నాయి. జీవీఎంసీ సిబ్బంది వీటి నియంత్రణపై ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వీటి సంతతి వృద్ధి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. విశ్వవిద్యాలయంలో కుక్కలను కట్టడి చేయడానికి జీవీఎంసీ అధికారుల సహకారం, తోడ్పాటు ఎంతో అవసరం. ఈ దిశగా జీవీఎంసీ అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట



తోటగరువు గెడ్డ ఆక్రమించి చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్ఐ ప్రవీణ్‌కుమార్

ఆరిలోవ: తోటగరువులో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలకు రూరల్ రెవెన్యూ అధికారులు అడ్డుకట్టు వేశారు. రెవెన్యూ అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పనులు ఆపకుండా చేపట్టడంతో చివరికి అధికారులే స్వయంగా గురువారం రంగంలోకి దిగారు. తోటగరువు ప్రాంతం సర్వే నంబరు 97లో రాధాకృష్ణ కల్యాణ మండపం వెనుక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకొని గెడ్డ ఆక్రమించి కొందరు నిర్మాణం చేపడుతున్నారు. దీంతో పాటు తోటగరువులోనే దీనికి సమీపంలో 57 సర్వే నంబరులో కొండ అంచును తవ్వి ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఆయా నిర్మాణాలపై ఫిర్యాదులు అందడంతో గురువారం రూరల్ మండలం తహసీల్దారు రమణయ్య ఆదేశాలతో ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బందితో వెళ్లి పనులు నిలిపేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని సదరు వ్యక్తులకు హెచ్చరించారు. ప్రభుత్వం భూములను రక్షించుకోవడంలో భాగంగా తోటగరువు ప్రాంతం 57, 97 సర్వే నంబర్లలో జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకున్నామని ఆర్ఐ తెలిపారు. ఆయా చోట్ల మళ్లీ నిర్మాణ పనులు చేపడితే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఏయూ సమాచారం

విజేతలకు వీసీ అభినందన



విజేతలకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా కళాశాలల వారీగా ఈ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, యూబీఏ నోడల్ అధికారి ఆచార్య జి.నాగరాజు, ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని, డాక్టర్ సోనీ హవీల, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఐఏఎస్ఈ యూనిట్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. పరిపాలనా భవనం కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థులకు, ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతగా విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించడంపై వీసీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ప్రోగ్రాం అధికారి కె.ప్రసన్నకుమారి, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు పాల్గొన్నారు.

ఉక్కపోత.. కరెంట్ కోత

ఆరిలోవ: పగలంతా భానుడి ప్రతాపంతో పాటు ఉక్కపోతతో అల్లాడుతున్న ఆరిలోవ వాసులకు రాత్రి వేళ కరెంట్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నగరంలో కార్యాలయాలు, షాపులు, షోరూంలలో పని చేసుకుంటూ, బయట కూలీ పనులు చేసుకుంటూ పగలంతా ఏదోలా గడిపేస్తున్నారు. రాత్రులు ఇంటికి చేరుకుని నిద్రపోదామంటే తరచూ కరెంట్ పోతోంది. విద్యుత్ సరఫరా విభాగం అధికారులు కొన్నిసార్లు పగలు ముందుగానే ప్రకటించి కరెంట్ కోత విధిస్తున్నారు. రాత్రి వేళ మాత్రం అప్రకటితంగా కోతలు పెడుతున్నారు. ఈ కరెంట్ కోత కొన్ని ప్రాంతాలలో గంటల తరబడి ఉంటోంది. లీలాసుందరినగర్, సుందరయ్యకాలనీ, నెహ్రూనగర్, పార్వతినగర్, ఆరిలోవ కాలనీ తదితర ప్రాంతాలలో తరచూ ఇదే పరిస్థితి నెలకొంది. లీలాసుందరినగర్, నెహ్రూనగర్‌లలో బుధవారం రాత్రి 10 నుంచి అర్ధరాత్రి దాటి 2 గంటల వరకు కరెంట్ లేదు. అసలే ఉక్కపోత, ఆపై కరెంట్ లేకపోవడంతో ఆయా కాలనీల వాసులు ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఉక్కపోతకు పిల్లలు ఏడుపులు, వృద్ధులు ఆయాసంతో ఇబ్బందిపడ్డారు. మంగళవారం రాత్రి 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సుందరయ్యకాలనీ, పార్వతీనగర్‌లలో మధ్య మధ్యలో ఐదుసార్లు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆరిలోవ కాలనీ, బాలాజీనగర్, పెదగదిలి, చినగదిలి ప్రాంతాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. విద్యుత్ విభాగం అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశమైన ఏపీజీఈఏ నాయకులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం గురువారం పిఠాపురం కాలనీలోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిష్కారానికి సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు తీసుకువెళ్లారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గత నెల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో చేసిన తీర్మానాల అమలుకు ఉద్యోగులంతా సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు కుసుమంచి కృష్ణాజీ, నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు అవసరం



బోదకాలు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం: బోదకాలు వ్యాధిగ్రస్తులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఇసుకతోట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మారుపల్లి హారిక పట్నాయక్ అన్నారు. బోదకాలు శుభ్రతపై శిక్షణ కార్యక్రమాలను జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట యూపీహెచ్‌సీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోదకాలు తీవ్రత పెరగకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. మలేరియా సూపర్‌వైజర్ వై.వి.ఎస్.రత్నం మాట్లాడుతూ బోదకాలు వాపు పెరిగి పోవడంతో పాటు, రక్తస్రావం జరుగుతుందన్నారు. ఈ స్థాయి చేరుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. దీనిలో భాగంగా చిన్న పాటి వ్యాయామాలు చేయాలన్నారు. అనంతరం శుభ్రతకు కావాల్సిన టబ్, టవల్, మగ్గు తదితర సామాగ్రితో కూడిన కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. 12 రోజులకు సరిపడా డీఈసీ మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శేషుబాబు, వార్డు పరిధిలోని సచివాలయాల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, బోదకాలు బాధితులు పాల్గొన్నారు.

22వ వార్డులో..

జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో బోదకాలు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్, రేసువానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనస్వీ పాల్గొని బాధితులకు పలు సూచనలు చేశారు. కాలు ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం శుభ్రతకు కావాల్సిన టబ్, టవల్, మగ్గు తదితరు సామగ్రితో కూడిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కుమార్, కె.వెంకటరావు, ఆరోగ్య కార్యకర్తలు పెంటపల్లి గణేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. పైనాపిల్ కాలనీలో 33/11 కేవీ పరిధిలో ఉన్న దుర్గానగర్ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు జరగనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాబజార్, పాండురంగాపురం, ఎర్నిదుర్గానగర్, ప్రగతినగర్, కనకమహాలక్ష్మీనగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

రోటరీ క్లబ్ వేసవి శిబిరాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు, చిన్నారులు

మద్దిలపాలెం: ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ వీసీసీ వేసవి శిక్షణా శిబిరాల పోస్టర్‌ను గురువారం పిఠాపురం కాలనీ పార్కులో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మధు బొర్ర, రొటేరియన్ మోదంబికా, వీసీసీ క్లబ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాప్రభ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ మూడు రోజుల పాటు అనకాపల్లి జిల్లా తిమ్మరాజుపేటలోని డావిన్సి ఇంటర్నేషనల్ స్కూల్‌లో వేసవి శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. ఈ శిబిరాలను 8, 9, 10 తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భావ వ్యక్తీకరణ, సమాజంలో కుటుంబాల సమూహాల గురించి అవగాహన కల్పించనున్నామన్నారు. గ్రామీణ వాతావరణం పరిచయం చేయడంతో పాటు కొండకర్ల ఆవలో బోటు ప్రయాణం వంటి అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 83098 12422, 93989 70538 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అక్కరమాని కోలుకోవాలని పూజలు

ఎంవీపీ కాలనీ: ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల త్వరగా కోలుకోవాలని కోరుతూ 18వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–11 బీచ్ రోడ్డును ఆనుకొని ఉన్న శ్రీఎల్లమ్మ తల్లి ఆలయంలో పెద్ద ఎత్తున కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమ్మిడి కల్యాణ్, మారుపల్లి పరదేశి, మారుపల్లి బుజ్జి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా గురువారం లలితానగర్ లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వర్ణకార అప్రైజర్లను ఆదుకోవాలి



బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: అరకొర జీతాలతో పని చేస్తున్న స్వర్ణకార అప్రైజర్లను బ్యాంకులు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు గురువారం బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్‌ను కలిసి పుష్పగుచ్ఛంతో పాటు వినతి పత్రం అందజేశారు. బ్యాంకు మనుగడకు దోహదపడుతున్న స్వర్ణకార అప్రైజర్లకు మాత్రం ఎటువంటి ఆధారం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని రీజనల్ మేనేజర్ హామీ ఇచ్చారు.

క్రైం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ



రికార్డులు పరిశీలిస్తున్న క్రైం డీసీపీ నాగన్న

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను గురువారం మధ్యాహ్నం క్రైం డీసీపీ జి.నాగన్న సందర్శించారు. ఆయనను క్రైం సీఐ ఎర్రం నాయుడు, ఎస్ఐ ఖగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రికార్డులు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించిన డీసీపీ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సిబ్బంది సంక్షేమంపై ఆరా తీశారు. ఎంత మంది విధుల్లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ ఇరుగ్గా ఉండటంతో కొత్త భవనం విషయమై సీపీ దృష్టిలో పెడతానని తెలిపారు. దీనికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. నైట్ డ్యూటీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అదృశ్యమైన యువకుడు ఆత్మహత్య



దారయ్య (ఫైల్)



మృతదేహం వద్ద విచారణ జరుపుతున్న సీఐ రామచంద్రరావు సిబ్బంది

ఆనందపురం : మండలంలోని కోలవానిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల అదృశ్యం కాగా గురువారం గోరింట శివారులోని ఓ లేఅవుట్‌లో శవమై కనిపించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోలవానిపాలెం గ్రామానికి చెందిన గంగ్రెడ్డి దేముడు, మహాలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం కాగా దారయ్య (26) ఆఖరివాడు. పదో తరగతి వరకూ చదువుకున్న దారయ్య పెందుర్తి మండలం గౌరపల్లిలో ఓ యజమాని వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. ఈ నెల 13న ఎప్పటిలాగే ద్విచక్ర వాహనంపై గౌరపల్లి వెళ్లి విధుల్లో జాయిన్ అయ్యాడు. సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి విధులు ముగించుకొని వస్తున్నానని సమాచారం ఇచ్చాడు. అనంతరం రాత్రి 8 : 30 గంటల ప్రాంతంలో మరలా ఇంటికి ఫోన్ చేసి పని ఉందని, ఇంటికి రావడం లేదని చెప్పాడు. అలా తెలిపిన దారయ్య మరుసటి రోజు ఉదయానికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అతను పనిచేస్తున్న యజమానిని వాకబు చేశారు. 13న సాయంత్రమే పనిలో నుంచి వెళ్లిపోయినట్టు తెలపడంతో దారయ్య ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి చేసి ఉంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలోని గోరింట గ్రామంలోని కొండవాలు ప్రాంతంలో వేసిన లే అవుట్‌లో యువకుడి శవం పడి ఉండడాన్ని కొంతమంది గమనించి పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అది దారయ్య మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. సీఐ రామచంద్రరావు, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఘటనా స్థలంలో ఉన్న పురుగుల మందు డబ్బా, మద్యం సీసా, వాటర్ బాటిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆన్ చేసి వివరాల సేకరణకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు పాల్పడడానికి ముందు రోజున దారయ్య తన స్నేహితుడిని కలిసి తనకు తీవ్ర అనారోగ్యంగా ఉందని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని కోరినట్టు తెలిసింది. అనారోగ్య కారణాల వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సహస్ర తులసి పూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవ వర్ణార్చన లక్ష్మీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

'నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల నిర్వహణా?'

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘ సర్వసభ్య సమావేశం గురువారం విశాఖలో జరిగింది. ఏపీఎఫ్ఏకు అనుబంధంగా ఉన్న ప్రస్తుత 26 జిల్లాలకు గానూ 20 జిల్లాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా.. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఎన్నిక నేపథ్యంలో శుక్రవారం తిరుపతిలో జరగనున్న సమావేశానికి ప్రస్తుత అధ్యక్షుడి హోదాలో హాజరుకావాల్సిందిగా బుధవారం మెయిల్ పంపారని ఏపీఎఫ్ఏ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ తెలిపారు. రాష్ట్ర సమావేశాన్ని విశాఖలో గురువారం నిర్వహించేందుకు గతంలోనే నిర్ణయించామని గుర్తు చేశారు. ఏపీఎఫ్ఏకు రిజిస్టరై ఓటింగ్ కలిగిన వ్యక్తులు లేకుండా ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తుండడంపై మండిపడ్డారు. రాష్ట్ర స్థాయి ఎంపికలు చేసిన వారికి ఓటింగ్‌లో పాల్గొనే అర్హత లేకుండా సన్నాహాలు చేయడాన్ని తప్పుపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కమిటీలో గైస్ ప్రిన్సిపాల్

మురళీనగర్ : 2023 పాలిసెట్ అడ్మిషన్ కమిటీలో విశాఖపట్నం గవర్నమెంట్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటరమణకు అవకాశం కల్పించారు. పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థుల ఎంపికలో ఈయన బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.